అయోమయం..తల్లికి వందనం



ఇదిగో ఇక్కడ మాట్లాడుతున్న మహిళ పేరు ఈరక్క. ఈమెది కళ్యాణదుర్గం నియోజకవర్గం కుందుర్పి మండలం మాయదార్లపల్లి గ్రామం. ఈమెకు ఐదుగురు సంతానం. ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇందులో పెద్ద కుమార్తె అంజలి కళ్యాణదుర్గంలోని జ్యోతిర్మయి ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. అమ్మాయికి ఏడాదికి సుమారు రూ.80 వేలు ఫీజు కడుతోంది. అదేవిధంగా రెండో కుమారుడు సిద్ధకుమార్ కుందుర్పిలోని రాధాస్వామి ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. బస్సు ఫీజుతో పాటు బాలుడికి ఏడాదికి రూ.22 వేలు కడుతున్నారు. అయితే ప్రభుత్వం ఇస్తామన్న తల్లికి వందనం ఇద్దరికి కలిపి రూ.30 వేలు వస్తుందనుకుంటే వచ్చేలా లేదని, కేవలం ఒక్కరికే అంటే రూ.15 వేలు ఎక్కడ చెల్లించాలంటూ ఈరక్క ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇది కూడా ఇప్పుడు వచ్చేలా కనిపించలేదని అసహనం వ్యక్తం చేసింది.

- కుటుంబంలో ఒక్కరికే వర్తిస్తుందా...లేదా ఎంత మంది పిల్లలకైనా ఇస్తారా?
- ప్రభుత్వ మార్గదర్శకాలపై తల్లిదండ్రుల్లో ఆందోళన

ఉరవకొండ/కళ్యాణదుర్గం/రాయదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న 'తల్లికి వందనం' స్టూడెంట్ కిట్ పొందేందుకు ఆధార్‌ను ప్రామాణికం చేసింది. ప్రభుత్వం జారీ చేసిన నూతన మార్గదర్శకాలతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. ఎన్నికలకు ముందు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏర్పాటైతే ఒకటి నుంచి ఇంటర్ వరకు చదివే పిల్లలు ఎంతమంది ఉన్నా వారందరికీ తల్లికి వందనం కింద ప్రతి ఒక్కరికీ ఏడాదికి రూ.15వేలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఇదే విషయాన్ని కూటమి మేనిఫెస్టోలోనూ పొందుపరిచారు. అన్ని ప్రభుత్వ పథకాలకు ఆధార్ తప్పనిసరి అయిన క్రమంలో ఈపథనానికి కూడా నిబంధన వర్తిస్తుందని విద్యాశాఖ అధికారులు చెప్తున్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉండి, 75 శాతం హాజరుశాతం ఉన్న ఒకటి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో ఏడాదికి రూ.15 వేలు చొప్పున ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ఈనేపథ్యంలో తల్లికివందనం అంతా అయోమయంగా మారిందని ప్రైవేట్ స్కూల్స్‌కు పంపే విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తూ, ఈ పథకాన్ని ప్రైవేట్ పాఠశాలలకు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ప్రభుత్వ/ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల వివరాలు:

మండలం	ప్రభుత్వ/ ప్రైవేట్ పాఠశాలలు	మొత్తం విద్యార్థులు	ప్రభుత్వ / ప్రైవేట్ కళాశాలలు	మొత్తం విద్యార్థులు
కళ్యాణదుర్గం	98	15134	05	2140
కంబదూరు	63	6344	01	98
కుందుర్పి	57	8114	01	272
బ్రహ్మ సముద్రం	51	6718	-	-
శెట్టూరు	58	6095	02	163
మొత్తం	327	42405	09	2673

రాయదుర్గం నియోజకవర్గంలోని పాఠశాలలు, విద్యార్థుల వివరాలు ఇలా..

మండలం	మొత్తం పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
రాయదుర్గం అర్బన్	40	7,680
రాయదుర్గం	38	6,220
డి హీరేహాళ్	48	8,816
కణేకల్లు	53	8,221
బొమ్మనహాళ్	50	8,998
గుమ్మఘట్ట	56	8,260
మొత్తం	285	48,195

ఉరవకొండ నియోజకవర్గంలో అమ్మ ఒడి కింద అర్హులైన విద్యార్థుల వివరాలు

మండలం	మొత్తం పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
ఉరవకొండ	68	13,000
వజ్రకరూరు	42	6,000
కూడేరు	38	4,700
బెళుగుప్ప	40	5,100
విడపనకల్లు	35	6,000
	223	34,800

దీంతో పాటు ఉరవకొండ నియోజకవర్గంలో ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థుల సంఖ్య 2,350 మంది ఉన్నారు.

'తల్లికి వందనం' కోసం ఎదురుచూస్తున్నాం



నా కుమార్తె ప్రైవేట్ కళాశాలలో డిప్లమా రెండో సంవత్సరం, కుమారుడు ప్రైవేటు స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైతే ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంత మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. మా ఇద్దరి పిల్లలకు రూ.30 వేలు వర్తిస్తుందని ఎదురు చూస్తున్నాం. త్వరగా బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తుందని ఎదురుచూస్తున్నాం.

– నూర్జహాన్, గృహిణి, కూడేరు

ఇలా అయితే చదివించలేం



మాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. అమ్మకు వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఏటా రూ.15 వేలు చొప్పున ఇస్తామని ప్రకటించారు. అలా అయితే నాకు రూ.45 వేలు బ్యాంకు ఖాతాలో జమ కావాలి. ఈ హామీని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నిలబెట్టుకోవాలి.

– ఎర్రమ్మ, అడిగుప్ప, గుమ్మఘట్ట మండలం

నలుగురు పిల్లలు చదువుతున్నారు



నా భర్తకు ఇటీవల ఆపరేషన్ అయింది. మాది పేద కుటుంబం. మా నలుగురు పిల్లల్లో ఇద్దరు కుమారులు పట్టణంలోని రాజీవ్‌గాంధీ ఉర్దూ హైస్కూల్‌లో 8,9 తరగతులు చదువుతున్నారు. మరో కుమారుడు, కుమార్తె రాజీవ్‌గాంధీ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. చదువుతున్న పిల్లల అవసరాలు తీర్చేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ఇంట్లో ఎంత మంది పిల్లలు చదివితే అంతమందికి తల్లికి వందనం కింద రూ.15 వేలు చొప్పున ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. దీంతో పిల్లల చదువుకు ప్రాధాన్యత ఇస్తున్నాం. 'తల్లికి వందనం' నగదు ఎప్పుడు ఇస్తారో..? ఇస్తే ఎందరికి ఇస్తారో అని ఆందోళనగా ఉంది.

– అజీరా, 24వ వార్డు, రాయదుర్గం

అంతా గందరగోళంగా ఉంది



నా పేరు అరుణమ్మ మాది బొమ్మనహాళ్ మండలం శ్రీధరఘట్ట. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇద్దరినీ ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్నాను. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలో భాగంగా ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ రూ.15 వేలు ఇస్తామన్నారు. ఇప్పుడు కేవలం ఒక్క విద్యార్థికి మాత్రమే తల్లికి వందనం వర్తిసుందని చెప్తున్నారు. ఇలా చేస్తే తల్లులందరినీ దగా చేసినట్టవుతారు.

– అరుణమ్మ, శ్రీధరఘట్ట గ్రామం, బొమ్మనహాళ్ మండలం

రూ.75 వేలు రావాల్సి ఉంది



నా పేరు జ్యోతి. కంబదూరు మండల కేంద్రంలో నివాసం ఉంటున్నాం. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే మాకు ఐదుగురు పిల్లలు ఉన్నారు. వీరంతా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైతే తల్లికి వందనం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికీ రూ.15 వేలు చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఐదుగురికి మొత్తం 75వేలు తల్లికి వందనం కింద వర్తిస్తుందని ఎదురుచూస్తున్నాం.

– జ్యోతి, కంబదూరు

అయోమయంగా ఉంది..



నా పేరు రోజమ్మ. బ్రహ్మసముద్రం మండలం ముప్పలకుంట గ్రామం. మాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారిని కళ్యాణదుర్గంలోని జ్ఞాన భారతి స్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నారు. అప్పు చేసి, పుస్తకాలు కొనాల్సి వస్తోంది. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైతే ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం పేరిట నగదు వర్తిస్తుందని హామీ ఇచ్చారు. పిల్లల ఫీజులు చెల్లించాలని పాఠశాల యాజమాన్యం ఒత్తిడి తెస్తోంది. తల్లికి వందనం నగదు త్వరగా ఖాతాల్లో జమ అవుతుందని ఆశగా ఎదురుచూస్తున్నాం.

– ఎన్. రోజమ్మ, ముప్పలకుంట, బ్రహ్మసముద్రం మండలం

క్లుప్తంగా

జగనన్నను కలిసిన ఎల్‌ఎం దంపతులు



మాజీ సీఎం వైఎస్ జగన్‌తో ఎల్‌ఎం దంపతులు

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం విజయవాడలోని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఉమాదేవి,ఆమె భర్త మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎల్‌ఎం మోహన్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించినట్లు ఎల్‌ఎం మోహన్‌రెడ్డి తెలిపారు. రాబోవు రోజుల్లో మంచి అవకాశం ఉంటుందని, పార్టీ అభివృద్ధికి మరింత కష్టపడాలని జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు ఎల్‌ఎం తెలియజేశారు.

13న డయల్ యువర్ డీఎం

రాయదుర్గంటౌన్: ఆర్టీసీ రవాణా సమస్యలు, సౌకర్యాలపై సలహాలు, సూచనలు అందించేందుకు ఈనెల 13న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం సురేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు జరిగే డయల్ యువర్ డీఎంలో భాగంగా 9959225863 నంబర్‌ను సంప్రదించి, సలహాలు, సూచనలు, సమస్యలు తెలియజేయాలన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

బెళుగుప్ప: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని వైద్యాధికారులు కార్తీక్‌రెడ్డి, ప్రియాంక ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం జనాభా దినోత్సవ పోస్టర్లతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, పీహెచ్‌ఎన్ సరోజ, ఎంపీహెచ్‌ఎస్ వసంత, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: బాలికలను ఎదగనిద్దాం..వారిని చదవనిద్దామని పీహెచ్‌సీ వైద్యులు రమేష్ తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ మురళీధర్,రాయదుర్గం మలేరియా సబ్‌యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్, సూపర్‌వైజర్ ఆదిబయమ్మ, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

ఖాతాదారులతోనే ప్రగతి



మాట్లాడుతున్న రీజనల్ మేనేజర్ శ్రీదేవి

కూడేరు: బ్యాంకులు అభివృద్ధి పథంలో నడవాలంటే ఖాతాదారులే కీలకమని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ (ఆర్‌ఎం) శ్రీదేవి అన్నారు. గురువారం ఆమె కూడేరులోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌ను తనిఖీ చేశారు. బంగారు, క్రాప్, హౌసింగ్, ఇతర రుణాల రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వాహణ పక్కాగా ఉండాలని సూచించారు. అనంతరం ఆమె సిబ్బందితో సమావేశమయ్యారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ రవికుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సాయం



ఐదుకల్లులో అనాథ పిల్లలకు ఫిక్స్ డిపాజిట్స్ పత్రాలను అందిస్తున్న దృశ్యం

శెట్టూరు: ఐదుకల్లులో తల్లిదండ్రులను కోల్పోయిన ముగ్గురు చిన్నారులకు ఆర్థికసాయం అందించారు. నెల రోజుల క్రితం తల్లి గొల్ల చంద్రకళ గుండెపోటుతో మృతి చెందింది. తండ్రి గొల్ల తిమ్మరాజు కుటుంబాన్ని వదిలి దూరంగా వెళ్లిపోయాడు. అనాథ చిన్నారులు ప్రభాని, అనుశ్రీ, మనికంఠ కి కొందరు యువత, ఉద్యోగులు రూ.6 లక్షలు సేకరించి, పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేయించారు. ఆ పత్రాలను ఐదుకల్లు సర్పంచ్ విరూపాక్షి గౌడ్, సింగిల్ విండో అధ్యక్షుడు ఎర్రస్వామి చేతుల మీదుగా పిల్లల సంరక్షకులకు గురువారం అందించారు. ఫండ్ సేకరించిన వారిలో సాయినాథ్, గురు, కైమాలి, ఉద్యోగులు అబ్దుల్ వాహబ్‌ఖాన్, మంజునాథ, వైఎస్సార్‌సీపీ నాయకులు గోళ సూరి, ఎమ్మెస్ రాయుడు, మాజీ సర్పంచ్ రామాంజనేయులు ఉన్నారు.

వేలం పాట వాయిదా

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో గురువారం నిర్వహించిన వేలం పాట వాయిదా పడింది. ఆలయ ఈఓ విజయ్‌కుమార్, పర్యవేక్షణ అధికారి డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాణి సమక్షంలో తలనీలాలు, టెంకాయలు, టెంకాయ చిప్పల వేలం పాటలు నిర్వహించారు. ఇందులో తలనీలాలు పోగు చేసే హక్కు కోసం 13 మంది పోటీపడ్డారు. రూ.12.50 లక్షల వద్ద పాట ఆగింది. టెంకాయలు అమ్ముకునే హక్కులకు నిర్వహించిన వేలంలో 18 మంది పోటీ పడగా, రూ.20 లక్షల వద్ద పాట ఆగింది. కొబ్బరిచిప్పలు సేకరించే హక్కుల కోసం నలుగురు పోటీపడ్డారు. రూ. 4.30 లక్షల వద్ద పాట ఆగింది. తదుపరి వేలం పాటలు ఈనెల 22న నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ తెలిపారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎంపీ పరామర్శ



మృతదేహాలకు నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య



బాధితుడికి చెక్కును అందిస్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రిలో మల్లికార్జునపల్లికి చెందిన మమత, చిన్నారి మృతదేహాలను మాజీ ఎంపీ రంగయ్య గురువారం పరిశీలించారు. మల్లికార్జునపల్లిలో చిన్నారిని చంపి, తనూ మమత అనే మహిళ ఉరివేసుకున్న విషయం విదితమే. మృతదేహాలను మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య గురువారం ఉదయం పరిశీలించారు. అధికార టీడీపీ చేస్తున్న అరాచకాలకు అమాయకులు బలి అవుతున్నారని అన్నారు. ప్రతి పార్టీకీ గెలుపోటములు సహజమని, కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చేయాలని అన్నారు. పోస్టుమార్టం త్వరగా చేసి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని అక్కడి వైద్యులకు సూచించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, నాయకులు యర్రంపల్లి కృష్ణమూర్తి, రామచంద్ర, భీమేష్, రామిరెడ్డి, హనుమంతరెడ్డి, సురేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం: మండలం ఎం.కొండాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు నారాయణస్వామిని మాజీ ఎంపీ డాక్టర్ తలారి రంగయ్య గురువారం పరామర్శించారు. అనంతరం ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

కంబదూరు: ఇటీవల మరణించిన మాజీ సర్పంచ్ నీలి నరసింహప్ప, అనారోగ్యంతో బాధపడుతున్న ఎంపీటీసీ నాగలక్ష్మి కుటుంబాలను మాజీ ఎంపీ తలారి రంగయ్య గురువారం పరామర్శించారు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, బీసీ, రైతు విభాగాల జిల్లా ప్రధాన కార్యదర్శులు గోవిండ్, కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, నాయకులు తిమ్మరాయుడు, డాక్టర్ బొమ్మయ్య, గోళ్ల సూరి, ఎర్రంపల్లి కృష్ణమూర్తి, మల్లూరి వెంకటేశులు, నారప్ప, మీసేవ కుమార్, అండేపల్లి రమేష్, ఒంటారెడ్డిపల్లి వెంకటేశులు పాల్గొన్నారు.

కంబదూరు: టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వారికి వైఎస్సార్‌సీపీ అండగా నిలిచింది. మండలంలోని తిప్పేపల్లికి చెందిన నరసింహులు టీడీపీ కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయాన్ని పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి మాజీ ఎంపీ తలారి రంగయ్య తీసుకెళ్లారు. అధినేత స్పందించి నరసింహులుకు రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. గురువారం ఆర్థిక సాయాన్ని తలారి రంగయ్య బాధితుడు నరసింహులుకు చెక్కు రూపంలో అందజేశారు. కష్టకాలంలో పార్టీ అధిష్టానం కార్యకర్తలకు అండగా ఉంటుందని మాజీ ఎంపీ రంగయ్య బాధితులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రామ్మోహన్, నాయకులు గోళ్ల సూరి, యర్రంపల్లి కృష్ణామూర్తి, గోపాల్ యాదవ్, నాగరాజు, రాము, ఓబుళేష్, ఎంపీటీసీ లింగమూర్తి పాల్గొన్నారు.

స్టోన్ క్రషర్ మూతేయాలని ఆందోళన

- పులకుర్తి, హౌసగుడ్డం గ్రామస్తుల ఆందోళన



గ్రామస్తులకు సర్ది చెపుతున్న అధికారులు

రాయదుర్గం (డి హీరేహాళ్): డి.హీరేహాళ్ మండలం పులకుర్తి, హౌసగుడ్డం గ్రామాల మధ్య నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన స్టోన్‌క్రషర్‌ను వెంటనే తొలగించాలంటూ రెండు గ్రామాల ప్రజలు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. రెండు గ్రామాల్లో సుమారు 3 వేల మందికి పైగా జనాభా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆకుల తిప్పయ్య కొండ చుట్టూ వ్యవసాయ భూములు అధికంగా ఉన్నాయని, పశువులు, మేకలు, గొర్రెలు మేపేందుకు సైతం అనువైన ప్రాంతం కావడంతో దశాబ్దాలుగా తాము కాపాడుకుంటూ వస్తున్నామన్నారు. ఇలాంటి చోట కొందరి స్వార్థానికి క్రషర్ ఏర్పాటు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. క్వారీలో రాయి పగులగొట్టేందుకు ఎత్తున డిటోనేటర్లు ఉపయోగిస్తున్నారన్నారు. దీంతో గ్రామంలో ఇళ్లు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ బోర్లలో నీరు అడుగంటి పోతోందన్నారు. సంబంధిత యజమానులకు క్వారీ, క్రషర్ ఏర్పాటు చేయొద్దని పలుమార్లు కోరినా లెక్క చేయడం లేదని వాపోయారు. సంబంధిత అధికారుల వద్ద మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని, ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండానే క్వారీ ఏర్పాటు చేసి తమ జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, ఆర్ఐ రామాంజినేయులు అక్కడకు చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందిగా ఉంటే క్రషర్ నిలిపేలా ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని తెలపడంతో ఆందోళనను విరమించారు.

అధిక జనాభాతో అనర్థాలు


ఉరవకొండ/కళ్యాణదుర్గం/బొమ్మనహాళ్: అధిక జనాభాతో పేదరికం మరింత తాండవిస్తుందని, దీనివల్ల అనేక అనర్థాలు కలుగుతాయని రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారిణి పావని తెలిపారు. గురువారం రాకెట్ల పీహెచ్‌సీ పరిధిలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. రాకెట్ల ప్రభుత్వ జెడ్పీహెచ్‌ఎస్‌లో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండీ షఫీ, హెచ్‌ఎం షకీలా, సీహెచ్‌ఓ నాగరంగయ్య, ఏఎన్ఎం పద్మావతి, పీడీ ఆనంద్ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.జయరామిరెడ్డి అధ్యక్షతన ప్రపంచ జనాభా దినోత్సవం గురువారం నిర్వహించారు. రిటైర్డ్ లెక్చరర్ మల్లికార్జున,వైస్ ప్రిన్సిపాల్ శేషయ్య, అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కోనంకి శ్రీధర్, రవిశంకర్, గురుంమోహన్, సుధాకర్‌పాల్గొన్నారు.

బొమ్మనహాళ్మండలంలోని గోనేహాళ్ గ్రామంలో ప్రపంచ జనాభా దినోత్సవంపై గురువారం ర్యాలీ చేశారు. వైద్యాధికారులు గీతాభార్గవి, కుమారరాజా మాట్లాడారు. సూపర్‌వైజర్ ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు వెంకటరమణ, గౌతమి, ఈశ్వరమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కుందుర్పి: స్థానిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు అధిక జనాభాతో కలిగే అనర్థాలపై కుందుర్పిలో గురువారం ర్యాలీ నిర్వహించారు.

మనోహర్‌శెట్టి మృతి తీరని లోటు



బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, వైస్ ఎంపీపీ నాగరత్నమ్మ కుమారుడు మనోహర్‌శెట్టి (45) అనారోగ్యంతో గురువారం మరణించారు. ఆయన భౌతికకాయాన్ని రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజనేయులు, సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, లోకేష్, నరసింహారెడ్డి, ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, రామకృష్ణ, అనీల్ రెడ్డి, ఆనంద్‌రెడ్డి, యల్లప్ప తదితరులు సందర్శించి, మృతదేహానికి నివాళులు అర్పించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి



కేపీ నీలప్ప (ఫైల్)

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని పోలేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ కేపీ నీలప్ప (80) గురువారం సాయంత్రం మృతిచెందాడు. స్థానిక నాయకులు నీలప్ప మృతదేహానికి నివాళులర్పించారు. నీలప్ప ఆర్ఎంపీ వైద్యుడిగా పనిచేసి, ప్రజలకు ఎంతో సేవ చేశారని గుర్తు చేసుకున్నారు. సర్పంచ్ శెట్టిగారి మంజునాథ, మాజీ ఎంపీటీసీ లోకేష్, ఉపసర్పంచ్ చిన్న నీలప్ప, నాగేంద్రప్ప, కేటీఆర్ మంజు, సుమిత్రపాల్, మహత్మరెడ్డి,జయరాం, దుర్గన్న తదితరుల నీలప్ప మృతదేహానికి నివాళులర్పించారు.

ప్రారంభమైన మొహర్రం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని పీర్ల చావిడిల్లో పీర్లను గురువారం ప్రతిష్ఠించారు. ఉచ్చుబాయి, గొందిబావిలోని పెద్దపీర్లు, బళ్లారి రోడ్డులోని చమ్మా మకాన్, ఆత్మకూరు వీధిలోని నింబూసా, లడ్డూ పీర్ల మకాన్ తదితర ప్రాంతాల్లోని చావిడిల్లో పీర్లు కొలువుదీరాయి. 14న చిన్న సరిగెత్తు, 16న పానకాల సమర్పణ, పెద్ద సరిగెత్తు, 17న కోటలో పీర్ల ఊరేగింపు, జలధి ఉంటుందన్నారు.

కూడేరులో కొలువుదీరిన పీర్లు

కూడేరు: మండల కేంద్రంలో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. గురువారం కూడేరులోని పీర్ల చావిడిలో పెద్ద వన్నూరు స్వామి, కుళ్లాయి స్వామి, చిన్న వన్నూరు స్వామి, బొడ్డు స్వామి, కబడి పీర్, బుర్రా బాబయ్య పీర్లతో పాటు ఇతర పీర్ల దేవుళ్ల కొలువుదీరాయి. ఆదివారం చిన్నసరిగెత్తు, మంగళవారం పెద్ద సరిగెత్తు (పానకాలు) పీర్ల దేవుళ్ల అగ్నిగుండ ప్రవేశం, బుధవారం జలధితో వేడుకలు ముగుస్తాయని తెలిపారు.

నేటి నుంచి లాలుస్వామి ఉత్సవాలు

కణేకల్లు: మండలంలోని ఎస్.హనుమాపురంలో లాలుస్వామి పీర్లదేవుడి ఉత్సవాలు ఈనెల 12 నుంచి 19 వరకు నిర్వహించనున్నారు. 12న సాయంకాలం లాలుస్వామి పీర్లదేవుడి పెట్టి మెరవణి, 14న చిన్న సరిగెత్తు, 16 పానకాలు, పెద్దసరిగెత్తు, 17న లాలుస్వామి పీర్ల ఊరేగింపు, జలధికి వెళ్లడం, 19న లాలుస్వామి పీర్లదేవుని చివరి దర్శనం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

జింక పిల్లకు చికిత్స

శెట్టూరు: గాయపడిన జింకకు వైద్యం అందిచి ఫారెస్ట్ అధికారులు సంరక్షిస్తున్నారు. గురువారం కైరేవు గ్రామ సమీపంలో ఉన్న తోటలోని గుంతలో గాయాలతో పడిఉన్న జింక పిల్లను సర్పంచ్ గంగాధర గమనించాడు. విషయాన్ని ఫారెస్ట్ అధికారులకు తెలిపాడు. దీంతో వారు అక్కడికి చేరుకొని గుంతలో పడి ఉన్న జింకను బయటకు తీశారు. వెటర్నరీ అధికారులతో చికిత్స చేయించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ జగనాథం, బీట్ ఆఫీసర్ తిమ్మక్క, వెటర్నరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం సురక్షితం

బెళుగుప్ప: ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం సురక్షితమని గైనిక్ విభాగం ప్రత్యేకాధికారి రాధ తెలిపారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా స్థానిక వైద్యాధికారులు కార్తీక్‌రెడ్డి, ప్రియాంకతో కలిసి గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. పీహెచ్‌ఎన్ సరోజ, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, ఎంపీహెచ్‌ఎస్ వసంత, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఏపీఎస్ఆర్టీసీ డిపోలో గురువారం ఎంప్లాయిస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈయూ గౌరవాధ్యక్షుడిగా పసుపులేటి నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఐటీయూసీ నాయకులు నాగార్జున, ఈయూ నాయకులు శ్రీరాములు, ఎస్ఎస్ వలి, జగదీష్, రామలింగ, కేటిరెడ్డి, సిద్దన్న, ఆది, మురళి, షాహిర్, కేఎస్‌బాబు పాల్గొన్నారు.

ముద్దచర్మ వ్యాధి నివారణకు టీకాలు

బ్రహ్మసముద్రం : మండలంలోని సంతే కొండాపురం, సూగేపల్లి, బ్రహ్మసముద్రం, రాయలదొడ్డి, ఎరడికెర గ్రామాల్లో పశువులకు ముద్దచర్మ వ్యాధి నివారణకు ఉచితంగా టీకా వేశారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకుల లింగన్న గౌడ్, రమణ నాయక్ , భానుప్రియ , గీత, సుధీర్ పాల్గొన్నారు.

మండల నిధుల మంజూరు వివరాలు తెలపండి

బ్రహ్మసముద్రం : మండలం వారీగా 2021 సెప్టెంబర్ నుంచి 2024 జూలై వరకు మండలానికి, మండల పరిషత్‌కు మంజూరైన నిధుల వివరాలు తెలియజేయాలని ఎంపీడీఓ దాసానాయక్‌ను ఎంపీటీసీలు కోరారు. గురువారం వినతి పత్రాన్ని ఎంపీడీఓ అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సునందమ్మ, ఎంపీటీసీలు రేణుకమ్మ, నాగలక్ష్మి, మారుతమ్మ, వరలక్ష్మి, నగేష్ , బూసప్ప, తిప్పేస్వామి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం సమాచారం

విద్యార్థులు చక్కటి కెరీర్‌ను ఎంచుకోవాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మమత

ఉరవకొండ: విద్యార్థులు ఇంటర్‌లోనే చక్కటి కెరీర్‌ని ఎంచుకొని, ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఉరవకొండ ప్రభుత్వ ఇంటర్ బాలుర, బాలికల కళాశాల ప్రిన్సిపాల్ మమత తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఇంటర్ బాలికల కళాశాల ఆవరణలో భవిష్యత్ సొసైటీ ఆధ్వర్యంలో ఇంటర్ తరువాత జీవితానికి బంగారు బాటలు ఎలా వేసుకోవాలి? అన్న అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శివప్రసాద్, జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబుళేసు, అధ్యాపకులు ప్రసాద్‌రెడ్డి, అరుణ, పద్మావతి పాల్గొన్నారు.

కదరంపల్లిలో వైద్య శిబిరం

కుందుర్పి: మండలంలోని కదరంపల్లిలో వైద్యాధికారులు వైద్య శిబిరం నిర్వహించారు. గురువారం 'కదరంపల్లిలో విషజ్వరాలు' శీర్షికన 'సాక్షి'లో వార్త ప్రచురితమైంది. దీంతో వైద్యాధికారులు స్పందించారు. డాక్టర్లు నారాయణ స్వామి, సోమశేఖర్. చాంద్‌బేగం తదితరుల ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఏఎన్ఎం మమత పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కూడేరు: మండల పరిధిలోని ముద్దలాపురంలో గురువారం రాత్రి హరిజన వన్నూరప్ప (32) ఇంటి వద్ద పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య , ఇద్దరు పిల్లలు ఉన్నారు. అప్పుల బాధతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ

ఉరవకొండ: పట్టణంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞలు గురువారం నిర్వహించారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ నుంచి ఐదు సచివాలయల ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్త ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేశారు. స్థానిక క్లాక్‌టవర్ వద్ద మానవహారం, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎంపీడీఓ సుబ్బరాజు, ఈఓఆర్‌డీ చంద్రమౌళి, ఈఓ గౌస్‌సాహెబ్, వైద్యాధికారిణి డాక్టర్ సాహితి, మలేరియా సబ్ డివిజన్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి మాట్లాడారు. ల్యాబ్‌టెక్నీషియన్‌లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలను బాధ్యతగా సంరక్షించాలి

కూడేరు: గురువారం మండలంలోని కలగళ్లలోని ప్రాథమిక పాఠశాలలో 'తల్లి పేరు మీద ఒక చెట్టు' కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్ జగదీష్ మొక్కలు నాటి నీరు పోశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. హెచ్‌ఎం మల్లికార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ అన్నారు.గురువారం టీ వీరాపురంలో అంగన్‌వాడీ కార్యకర్త హేమలత సెంటర్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. అంగన్‌వాడీ వర్కర్లు హేమలత, రాధ, సరస్వతి, చదంలత, గ్రామదట్ల వరలక్ష్మి, హనుమక్క, ఏఎన్ఎం పార్వతి, ప్రధానోపాధ్యాయులు ఓబుళేసు, ఉపాధ్యాయులు జంబునాథ్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి..

కంబదూరు: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని ఏపీడీ రమేష్‌నాయక్, ఎంపీడీఓ సాల్మన్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రం–5లో, చెన్నంపల్లి గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. సర్పంచ్ కోకా ముత్యాలమ్మ, ఏపీఓ ఉస్మాన్ ఆలీ, అంగన్‌వాడీ కార్యకర్త విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

పశువులకు ముద్ద చర్మవ్యాధి టీకాలు

గుమ్మఘట్ట: మండలంలోని మారెంపల్లి, జె.వెంకటంపల్లి, కోనాపురం, తాళ్లకెర గ్రామాల్లోని 896 పశువులకు ముద్ద చర్మవ్యాధి నివారణ టీకా అందించినట్లు పశువైద్యులు నవీన్‌కుమార్ తెలిపారు. పశువులకు ముందస్తుగా టీకాలు అందిస్తూ నివారణ చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది నాగభూషణం, రమేష్, ఆసీఫ్, ప్రహ్లాద, పక్కీరప్పపాల్గొన్నారు.

గురుపౌర్ణమికి భిక్షాటన

వజ్రకరూరు: మండల కేంద్రంలో స్థానిక షిర్డీసాయి ఆలయంలో ఈనెల 21న గురు పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం భిక్షాటన నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో షిర్డీసాయి చిత్రపటం ఉంచి వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వచ్ఛందంగా బియ్యం, బేడలు, బెల్లం తదితరాలు సమర్పించారు.